క్లుప్తంగా

ప్రజారోగ్య కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యం

నెహ్రూనగర్: ప్రజలు నిద్ర లేవక ముందే విధుల్లో ఉండే ప్రజారోగ్య కార్మికుల సంక్షేమానికి నగరపాలక సంస్థ అధిక ప్రాధాన్యం ఇస్తుందని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. ప్రజారోగ్య కార్మికుల కష్ట ఫలితమే జాతీయ స్థాయిలో స్వచ్ఛ సూపర్ లీగ్ నగరాల్లో గుంటూరు నగరం నిలిచిందని పేర్కొన్నారు. చుట్టుగుంట పోలేరమ్మ దేవాలయం కల్యాణ మండపంలో బుధవారం ఐటీసీ ఎంఎస్‌కే, ఫినిష్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రజారోగ్య కార్మికులకు ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కార్మికులకు నగరపాలక సంస్థ అండగా ఉంటుందని తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఇన్స్యూరెన్స్ అమలు చేస్తున్నామని చెప్పారు. క్షేత్ర స్థాయిలో ఏ సమస్య ఉన్నా కార్మికులు తమ దృష్టికి తీసుకు రావాలని ఆయన కోరారు.

బీజేపీలో పలువురు చేరిక



గుంటూరు మెడికల్: బీజేపీలో జిల్లా విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం బుధవారం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్.మాధవ్ సమక్షంలో నిర్వహించారు. ఆయన సమక్షంలో డొక్కు సత్యనారాయణ రాజు యాదవ్, నారిశెట్టి దుర్గా, మధుసూదనరావు, అక్కిరాజు పి. విజయ కుమార్, షేక్ అల్లాబక్షు, కనుబుద్దు సుబ్బారెడ్డి, డి.వినయ్ కుమార్ యాదవ్ తదితరులు పార్టీలో చేరారు. మాధవ్ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు, రాష్ట్ర కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు వి.పాండురంగ విఠల్, గుంటూరు రూరల్ మండలం అధ్యక్షుడు కంచర్ల రాజేష్ పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలు కూల్చివేత



నెహ్రూనగర్: నగరంలో అనుమతులు లేకుండా నిర్మించే ఎటువంటి కట్టడాలనైనా కూల్చివేస్తామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు హెచ్చరించారు. నగరంలో గత మూడు రోజుల నుంచి పట్టణ ప్రణాళిక విభాగం ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో అక్రమ కట్టడాలను గుర్తించి, తొలగించారు. ఇప్పటికే వార్డు సచివాలయాల వారీగా అనధికారిక, ప్లాన్‌కి విరుద్ధంగా నిర్మించిన భవన యజమానులకు నోటీసులు జారీ చేశామని కమిషనర్ తెలిపారు. సదరు నిర్మాణాలను కూల్చివేయడానికి పట్టణ ప్రణాళిక అధికారులకు కూడా ఆదేశాలు జారీ చేశామని చెప్పారు. ఇప్పటికే నగరంలో ఇన్నర్ రింగ్ రోడ్డులోని భవానీనగర్ , శ్రీరామనగర్ 7వ లైన్, బొంగరాల బీడు, అరండల్ పేట ప్రాంతాలలో అక్రమ కట్టడాలను కూల్చినట్లు వెల్లడించారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో గుర్తించి తుది నోటీసులు అందించిన 25 అనధికార భవనాలను గురువారం కూల్చివేత చేపట్టాలని ఆయన ఆదేశించారు. శుక్రవారం నుంచి అనధికార లే అవుట్స్ తొలగించాలని చెప్పారు. అనధికార హోర్డింగ్స్‌ని ఉపేక్షించ వద్దని, ఫీజులు చెల్లించని ఏ బోర్డునైనా తొలగించాలని కమిషనర్ ఆదేశించారు.

ఘనంగా ఎస్‌బీఐ ఆవిర్భావ దినోత్సవం



కొరిటిపాడు(గుంటూరు): స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆఫీసర్స్ అసోసియేషన్ అమరావతి సర్కిల్ 9వ ఆవిర్భావ దినోత్సవాన్ని స్థానిక కన్నావారితోటలోని స్టేట్ బ్యాంక్ మెయిన్ బ్రాంచ్ ఆవరణలో బుధవారం ఘనంగా నిర్వహించారు. భారీ కేక్ కట్ చేశారు. ముందుగా డిప్యూటీ జనరల్ మేనేజర్ కృష్ణ ప్రభు మాతృశ్రీ అనాథ శరణాలయం విద్యార్థులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. చీఫ్ రీజినల్ సెక్రటరీ జయకుమార్ మాట్లాడుతూ సభ్యుల హక్కుల పరిరక్షణ, జీతభత్యాలు పెంపు సంబంధిత అన్ని విషయాల్లో వెన్నంటి ఉండి వారి అభ్యున్నతికి అసోసియేషన్ ఎంతగానో తోడ్పడుతుందని తెలిపారు. కార్యక్రమంలో బ్యాంక్ ఏజీఎం రాం ప్రసాద్, తారకేశ్వరరావు, సంఘం నాయకులు కోటిరెడ్డి, సునీల్, రతన్ రాజ్, బషీర్ అహ్మద్, కల్యాణ్, వీరాంజనేయులు పాల్గొన్నారు.

స్టేట్ టీచర్ అవార్డులకు దరఖాస్తులకు ఆహ్వానం

పెదకాకాని : యూనివర్సిటీ నుంచి 2025 సంవత్సరానికి స్టేట్ బెస్ట్ టీచర్ల అవార్డుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఉన్నత విద్యా మండలి జాయింట్ డైరెక్టర్, సెక్రటరీ(ఎఫ్ఏసి) టి.వి. శ్రీకృష్ణమూర్తి వర్సిటీలకు లేఖ పంపారు. ఫ్యాకల్టీల వారీగా స్టేట్ బెస్ట్ టీచర్ అవార్డులకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈనెల 18వ తేదీలోగా వర్సిటీ నుంచి దరఖాస్తుల చేసుకునేందుకు ఆఖరు తేదీగా లేఖలో పేర్కొన్నారు. వర్సిటీలో ఆయా అభ్యర్థుల జాబితాలను ఈనెల 21లోగా ఉన్నత విద్యామండలి కార్యాలయానికి అందేలా పంపాల్సి ఉంది. మొత్తం 16 విభాగాల్లో 42 అవార్డులను అందజేయనున్నామని తెలిపారు. 16 విభాగాల్లో 42 అవార్డులను అందజేయనున్నారు.

వ్యాక్సిన్‌తో గర్భాశయ క్యాన్సర్‌కు చెక్

- చాపకింద నీరులా విస్తరణ
- ఎన్‌సీడీ- సీడీ సర్వేలో బయటపడుతున్న కేసులు
- జిల్లావ్యాప్తంగా 14,08,061 మంది మహిళలకు స్క్రీనింగ్ పరీక్షలు
- ముందస్తు జాగ్రత్తలతో కట్టడి

గుంటూరు మెడికల్: క్యాన్సర్.... ఈ పేరు వింటేనే ప్రతి ఒక్కరిలో వణుకు పుడుతుంది. పూర్వం రాచపుండుగా పిలువబడే క్యాన్సర్ సోకితే మరణమే అనే భావన చాలా మందిలో ఉంది. నేడు పల్లె, పట్నం అనే తేడా లేకుండా జిల్లా వ్యాప్తంగా కేసులు చాపకింద నీరులా నమోదవుతున్నాయి. ఆధునిక జీవనశైలి వల్లే సంఖ్య పెరిగిపోతోందని వైద్య నిపుణులు తెలియజేస్తున్నారు. గత ఏడాది నవంబర్ 14న నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్-కమ్యూనికబుల్ డిసీజెస్(ఎన్‌సీడీ-సీడీ) 3.0 కార్యక్రమంలో భాగంగా జిల్లాలో క్యాన్సర్ స్క్రీనింగ్ ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో భాగంగా వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి, 18 ఏళ్ల దాటిన మహిళలకు పరీక్షలు చేశారు. జిల్లాలో 18 ఏళ్ల దాటిన వారు 17,56,176 మంది ఉండగా వీరిలో 14,08,061 మందికి స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. ఈ ఏడాది జూన్ నాటికి జిల్లా వ్యాప్తంగా ఓరల్ క్యాన్సర్(నోరు) బాధితులు 201 మంది, బ్రెస్ట్ క్యాన్సర్ బాధితులు(రొమ్ము) 498 మంది, సర్వైకల్ క్యాన్సర్ బాధితులు(గర్భాశయ ముఖ ద్వారం) 303 మంది ఉన్నట్లు వైద్య సిబ్బంది నిర్ధారించారు. క్యాన్సర్‌పై అంతగా అవగాహన లేకపోవడంతో పేద, మధ్యతరగతి మహిళలు వ్యాధి బారిన పడి అష్టకష్టాలు పడటమే కాకుండా కొన్నిసార్లు ప్రాణాలు సైతం కోల్పోతున్నారు.



గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్‌కు వ్యాక్సిన్

ప్రభుత్వం సర్వే చేయిస్తున్న మూడు రకాల్లో గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్ కూడా ఉంది.దీనికి వ్యాక్సిన్ ఉందనే విషయం చాలా మంది తెలుసుకోక ముందస్తుగా చేయించుకోవడం లేదు. గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్ వల్ల మన దేశంలో ప్రతి గంటకు తొమ్మిది మంది చనిపోతున్నారు. వ్యాధిని కట్టడి చేయకుండా వదిలేస్తే ఇంకా కేసుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. గ్రామీణ ప్రాంతాల్లోనే ఎక్కువ మంది సోకి అవస్థలు పడుతున్నారు.

సర్వైకల్ క్యాన్సర్ లక్షణాలు

గర్భాశయ ముఖ ద్వారా క్యాన్సర్ లక్షణాలను ప్రాథమిక దశలో గుర్తించలేరు. రుతుక్రమ సమయంలో లేదా లైంగిక సంభోగం తరువాత యోని నుంచి అసాధారణంగా రక్తస్రావం జరుగుతుంది.పీరియడ్స్ ఆగిపోయిన తర్వాత రక్తస్రావం, యోని నుంచి దుర్వాసన వస్తుంది. రక్తంతో కూడిన గడ్డలు రావడం, యోని నుంచి మలం వస్తుంది. మూత్రం, మల విసర్జనలో ఆటంకాలు ఏర్పడతాయి. పొత్తికడుపులో నొప్పి, నడుంనొప్పి, కాళ్ల నొప్పి, కాళ్ల వాపు ఉంటాయి. బరువు తగ్గడం, ఆకలి లేకపోవటం, నీరసం, అలసట వంటి లక్షణాలు కనిపిస్తాయి.

కారణాలు ఇవి..

సర్వైకల్ క్యాన్సర్ సోకడానికి ప్రధాన కారణం హ్యూమన్ పాపిలోమా వైరస్ (హెచ్‌పీవీ). ఎక్కువ మంది భాగస్వాములతో శృంగారంలో పాల్గొనడం వల్ల శరీరంలోకి ప్రవేశిస్తుంది. ఇది కొన్నేళ్ల తర్వాత వృద్ధి చెంది క్యాన్సర్‌కు కారణమవుతుంది. హెచ్ఐవీ, ఎయిడ్స్ రోగుల్లో, కొన్ని రకాల మందులు తరచూ వాడడం వల్ల రోగనిరోధక వ్యవస్థ బలహీనపడుతుంది. తద్వారా కూడా సర్వైకల్ క్యాన్సర్ ముప్పు పొంచి ఉంటుంది. చిన్న వయస్సులో శృంగారంలో పాల్గొనడం వల్ల హెచ్‌పీవీ ఇన్ఫెక్షన్ సోకే ముప్పు ఎక్కువగా ఉంటుంది. బాల్య వివాహాలు చేసిన వారిలో ఈ కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. గర్భనిరోధక మాత్రలు ఏళ్ల తరబడి వాడినా సర్వైకల్ క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉంది. నెలసరి సమయంలో సరైన వ్యక్తిగత పరిశుభ్రత పాటించకపోవడం కూడా ముప్పును పెంచుతుంది. ధూమపానం, అనారోగ్యకరమైన జీవనశైలి, వంశపారంపర్యంగా కూడా కొంతమందిలో వచ్చే ప్రమాదం ఉందని పలు నివేదికలు స్పష్టం చేస్తున్నాయి ఈ కేసులు అత్యధికంగా పేద కుటుంబాల్లోని మహిళల్లోనే వెలుగుచూస్తున్నాయి.

అందుబాటులో వ్యాక్సిన్



క్యాన్సర్ రాకుండా నేడు హెచ్‌పీవీ వ్యాక్సిన్ అందుబాటులో ఉంది.సర్వైకల్ క్యాన్సర్ నివారణకు తొమ్మిదేళ్ల నుంచి 20 ఏళ్ల లోపువారికి ముందస్తుగా వ్యాక్సినేషన్ వేయించుకోవాలి. రెండు మోతాదుల్లో వ్యాక్సిన్ వేయించుకోవడం ద్వారా క్యాన్సర్ రాకుండా నివారించవచ్చు. టీకాలు చాలా సురక్షితమైనవి. హైరిస్క్ గ్రూపుకు చెందిన మహిళలు వ్యాధిపై అవగాహన కల్గి ఉండి జాగ్రత్తలు తీసుకోవాలి. 30 నుంచి 45 సంవత్సరాల లోపు మహిళలు ఏడాదికి కనీసం ఒకసారైనా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలి.

–డాక్టర్ బైరపనేని స్రవంతి, క్యాన్సర్ వైద్య నిపుణులు, గుంటూరు.

అవగాహన కల్పిస్తున్నాం



క్యాన్సర్ లక్షణాలు కనిపిస్తే వెంటనే డాక్టర్లను సంప్రదించాలి. ముందస్తుగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించాలి. ప్రభుత్వం ఉచితంగా చేయిస్తుంది. కౌమార దశలో బాలికలు గర్భాశయ ముఖ ద్వారా క్యాన్సర్ సోకకుండా హెచ్‌పీవీ వ్యాక్సిన్ వేయించుకోవాలి. వ్యాధిపై గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నాం. వ్యాధిగ్రస్తులు భయపడాల్సిన పనిలేదు. గుంటూరు జీజీహెచ్‌లో అత్యాధునిక క్యాన్సర్ వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయి. క్రమం తప్పకుండా చికిత్స చేయించుకుంటే జయించవచ్చు.

–డాక్టర్ కొర్రా విజయలక్ష్మి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి, గుంటూరు.

అణు వినాశనపు నూతన శకంలోకి అడుగులు



లక్ష్మీపురం: జపాన్ నగరం హిరోషిమాపై దాడి జరిగిన 80 ఏళ్ల తరువాత కూడా మన నడవడికను సరిదిద్దుకోకపోగా, అణు వినాశనపు నూతన శకంలోకి అడుగులు వేసేందుకు పెద్ద పొరపాట్లు చేస్తూనే ఉన్నామని అవగాహన సంస్థ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో బుధవారం జరిగిన సభలో యోగాచార్యులు అచ్యుత ఇందుశేఖర్ మాట్లాడారు. ప్రపంచ దేశాల మధ్య యుద్ధాలు, దురాక్రమణలు, పట్టుదలతో ఈ భూగోళం అణు యుద్ధానికి దగ్గరవుతోందని తెలిపారు. మునుపెన్నడూ లేనంతగా ప్రపంచం అణ్వస్త్రాలతో నిర్మూలనం కాగల ప్రమాదం అంచున ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అణు సామర్థ్యశక్తులను ఆధునీకీకరించే పనులను ఉత్తర కొరియా చేపడుతోందని తెలిపారు. సీనియర్ సిటిజన్ టి.నారపరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం వివిధ దేశాల వద్ద 12వేల అణు ఆయుధాలు ఉన్నట్లు తెలుస్తోందని తెలిపారు. హిరోషిమా, నాగసాకిలపై జరిగిన అణుబాంబుల దాడిలో 2.40 లక్షల మంది మరణించారని, పది లక్షల మంది రేడియోధార్మిక ప్రభావంతో నరకం చూశారని చెప్పారు. ఈ సభలో విద్యావేత్త రవిబాబు, న్యాయవాది ఎ.హరి, మురళీకృష్ణ పాల్గొన్నారు.

అనధికార కట్టడాలు, లే అవుట్స్‌పై కఠిన చర్యలు

కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో అనధికార కట్టడాలు, లే అవుట్స్, హోర్డింగ్స్, ట్యాప్‌లు 48 గంటల్లోగా స్వచ్ఛందంగా తొలగించుకోవాలని, లేనిపక్షంలో జీఎంసీ సిబ్బందే తొలగిస్తారని కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. తొలగింపు ఖర్చుతో పాటు అపరాధ రుసుం కూడా విధిస్తామని స్పష్టం చేశారు. ఆయన బుధవారం శారదా కాలనీ, సంజీవయ్య నగర్, కేవీపీ కాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. అనధికార కట్టడాలపై పట్టణ ప్రణాళిక అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరపాలక సంస్థ నుంచి అధీకృత ప్లాన్, అనుమతి లేకుండా అనధికార నిర్మాణాలు, లే అవుట్లు ఏర్పాటు చేసిన వారు 48 గంటల్లోగా స్వచ్ఛందంగా తొలగించుకోవాలని ఆదేశించారు. చాలా ప్రాంతాల్లో అనధికార మున్సిపల్ కుళాయిలు కూడా ఉన్నాయని వాటిని తొలగించుకోవాలని తెలిపారు. నగరంలో రోడ్లు, డ్రెయిన్లు ఆక్రమించుకొని ట్రాఫిక్, మురుగు పారుదలకు సమస్యలు సృష్టిస్తున్న వారు తక్షణమే ఆక్రమణలు తొలగించుకోవాలని ఆయన చెప్పారు. వార్డుల వారీగా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకోవడానికి కార్యాచరణ సిద్ధం చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏసీపీ వెంకటేశ్వరరావు, డీఈఈ వెంకటరమణ, ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక, ప్రజారోగ్య అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ సంస్థలు కూడా బకాయిలు చెల్లించాలి

నగరపాలక సంస్థ పరిధిలోని కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు కూడా సర్వీస్ చార్జీల బకాయిలు చెల్లించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. తన కార్యాలయంలో బుధవారం వివిధ కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల అధికారులతో సర్వీస్ చార్జీల వసూళ్లపై అదనపు కమిషనర్ చల్లా ఓబులేసుతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని సౌత్ సెంట్రల్ రైల్వే, పోస్టల్, సెంట్రల్ ఎక్సైజ్, ఇన్‌కంటాక్స్, మిలటరీ, నెహ్రూ యువ కేంద్రం, స్పైసెస్ బోర్డ్, సీటీఆర్ఐ స్టేషన్ వంటి కేంద్ర ప్రభుత్వ సంస్థలు 141 అసెస్‌మెంట్ల ద్వారా సుమారు రూ.36 కోట్లు సర్వీస్ చార్జీలు బకాయిలు ఉన్నాయని తెలిపారు. బకాయిల చెల్లింపు కోసం నగరపాలక సంస్థ రెవెన్యూ అధికారులను డిపార్ట్‌మెంట్ల వారీగా షెడ్యూల్ కేటాయించాలని అదనపు కమిషనర్‌కు తెలిపారు. ఆయా సంస్థలకు ఇప్పటికే డిమాండ్ నోటీసులు ఇచ్చామని, అందులో ఏమైనా సందేహాలు ఉంటే రెవెన్యూ అధికారులతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. అవసరమైన వాటిని రీ అసెస్ చేయడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ సీహెచ్.శ్రీనివాస్, రెవెన్యూ అధికారులు, కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల ప్రతినిధులు పాల్గొన్నారు.



అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

బ్యాంక్ ఖాతాదారులకు మెరుగైన సేవలు

హెచ్‌డీఎఫ్‌సీ రీజినల్ హెడ్ శ్రీకాంత్‌రెడ్డి

కొరిటిపాడు(గుంటూరు): హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సేవలను మరింత విస్తరించనున్నట్లు రీజినల్ హెడ్ ముని శ్రీకాంత్‌రెడ్డి స్పష్టం చేశారు. గుంటూరు నగరంలోని ఓ హోటల్‌లో బుధవారం ఖాతాదారుల సమావేశం నిర్వహించారు. ముందుగా ముఖాముఖీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా బ్యాంక్ సేవలను మరింత విస్తృత పరచి, కస్టమర్ల సంపదను పెంచే దిశగా నమ్మకాన్ని చూరగొన్నదని వెల్లడించారు. పలువురు ఖాతాదారులు మాట్లాడుతూ బ్యాంకు తమ నమ్మకాన్ని మరింత రెట్టింపు చేసిందని పేర్కొన్నారు. ఇలాంటి సమావేశాలు తమకు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. సమావేశంలో బ్యాంక్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీకాంత్‌రెడ్డి

చుండూరు మృతవీరులు, గద్దర్‌కు నివాళులు



నివాళులర్పిస్తున్న దళిత సంఘాల నాయకులు

నెహ్రూనగర్: చుండూరులో దళితులను అగ్రవర్ణాల వారు అత్యంత దారుణంగా హతమార్చి బుధవారానికి 30 ఏళ్లు పూర్తయిన సందర్భంగా, ప్రజా గాయకుడు విప్లవకారుడు గద్దర్ రెండో వర్ధంతిని పురస్కరించుకుని లాడ్జి సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద భీమ్‌సేన సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షులు నల్లపు నీలాంబరం ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో దళితులపై జరుగుతున్న దాడులను ఐక్యంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. గద్దర్ అణగారిన, పీడిత, వర్గాల కోసం జీవితాంతం అలుపెరగని పోరాటం చేశారని తెలిపారు. ఆయన మృతి దళిత, బడుగు, బలహీన వర్గాల వారికి తీరని లోటని పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు మద్దు ప్రేమజ్యోతిబాబు, ఎన్‌జే విద్యాసాగర్, జీఆర్ భగత్‌సింగ్, జూపూడి శ్రీనివాసరావు, టి. గోవింద్, చిన్నం డేవిడ్ విలియమ్స్, విల్సన్, బత్తుల అనిల్‌కుమార్, కోటేశ్వరరావు, కమలకుమారి, సుధా, రమణ తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్లు ఇవ్వని వ్యక్తిపై కేసు నమోదు

పట్నంబజారు: బుక్ చేసుకున్న సెల్‌ఫోన్లు ఇవ్వకుండా దుర్భాషలాడిన వ్యక్తిపై కేసు నమోదైంది. పాత గుంటూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వాసవీ కాంప్లెక్స్‌లో వస్త్ర వ్యాపారం చేసుకునే పవన్ ఢిల్లీలో పది ఐ ఫోన్లు బుక్ చేసుకున్నాడు. అవి హైదరాబాద్ వచ్చి ఉన్నాయి. తన స్నేహితుడు వినోద్‌కు తీసుకు రావాలని చెప్పాడు. ఫోన్లు తీసుకున్న అతడు ఇవ్వకుండా సెల్ స్విచ్ ఆఫ్ చేసి ఉడాయించాడు. వాట్సాప్ కాల్ చేసి ఫోన్లు ఇవ్వాలని పవన్ కోరగా, ఇవ్వనంటూ దుర్భాషలాడాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఏఎన్‌యూలో కలరిపట్టుపై కళాత్మక శిక్షణ

పెదకాకాని (ఏఎన్‌యు): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని థియేటర్ ఆర్ట్స్ విభాగం, యడ్లపాడు వేదిక నాటక విభాగాలు సంయుక్తంగా వారం రోజుల కలరిపట్టుపై కళాత్మక శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించాయి. థియేటర్ ఆర్ట్స్ విభాగంలో డాక్టర్ ముత్తవరపు సురేష్ బాబు కళావేదికపై ఈ శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. కలరిపట్టు అంటే కేరళ రాష్ట్రం యుద్ధ విద్య. దీనిపై ఈ శిక్షణా తరగతులు జరుగుతున్నాయి. శిక్షకులుగా కర్ణాటక నుంచి ఉదయకుమార్, ఏపీ నుంచి కుంగ్ ఫూ ఫణీంద్ర, తమిళనాడు నుంచి డాక్టర్ రూపలు వ్యవహరిస్తున్నారు. ప్రారంభ కార్యక్రమానికి నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా బెంగళూరు చాప్టర్ డైరెక్టర్ వీణ శర్మ, సుశీల్ శర్మ, వేదిక థియేటర్ నుంచి డాక్టర్ ముత్తవరపు సురేష్‌బాబు, వరగాని నాగేశ్వరరావు, పద్మారావు పాల్గొన్నారు. ఈ శిక్షణలో యుద్ధ విద్య ఆవశ్యకతలో నటుడు పూర్తిస్థాయిగా తన శరీరాన్ని మలుచుకునేందుకు ప్రదర్శనలు దోహదపడతాయన్నారు. కలరిపట్టు శారీరక అభ్యాసాల ప్రదర్శనలు వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేయడానికి సుముఖత వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విభాగాధిపతి ఆచార్య ఎల్‌వీ భూషణరావు మాట్లాడుతూ ఈ శిక్షణా తరగతులకు 20 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. తరగతుల నిర్వహణకు తాత్కాలిక వీసీ ఆచార్య కె.గంగాధరరావు పూర్తి సహకారం అందించారని పేర్కొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం

పెదకాకాని: శివాలయం అభివృద్ధికి దాతల సహకారం అభినందనీయమని ఉప కమిషనర్ గోగినేని లీలాకుమార్ అన్నారు. పెదకాకాని శ్రీ భ్రమరాంబా సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానం శివాలయంలో నిత్యాన్నదాన పథకానికి మంగళగిరి పట్టణానికి చెందిన పలగాని నరసింహారావు శివనాగేశ్వరమ్మ దంపతులు బుధవారం ఆలయ డిప్యూటీ కమిషనర్ గోగినేని లీలాకుమార్‌కు 50 వేల రూపాయలు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా డీసీ మాట్లాడుతూ ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, నిత్యాన్నదాన పథకానికి భక్తులు సహాయ సహకారాలు అందించి, అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. దాతలు పలగాని నరసింహారావు దంపతులకు స్వామి వారి ప్రత్యేక దర్శనం చేయించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. వేదాశీర్వచనం చేయించి స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి చిత్రపటం అందజేశారు

జీవీఆర్ఎస్ కళాశాలలో హ్యాకథాన్ ప్రోగ్రాం

గుంటూరు రూరల్ : మండలం లోని బుడంపాడు గ్రామం లోగల జీవి ఆర్ ఎస్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ టెక్నాలజీలో హ్యాకథాన్ బుధవారం ఘనంగా నిర్వహించారు. టెక్ ఫైల్ సహకారంతో కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ప్రధానంగా వెబ్ డెవలప్మెంట్, ఏఐ టూల్స్ గురించి ఇంజనీరింగ్ విద్యార్థులకు శిక్షణ అందించారు. హ్యాకథాన్ ఉద్దేశాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. భాస్కర్ నాయుడు, డీన్ డాక్టర్ బి. వరప్రసాద్, టెక్ ఫైల్ ప్రతినిధి వై.రవివర్మ విద్యార్థులకు తెలిపారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా ఇంజనీరింగ్ పూర్తి చేసుకున్న వారికి మంచి ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానం, పోటీ ప్రపంచం నేపథ్యంలో విద్యార్థులు నైపుణ్యం పెంచేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని తెలిపారు . హ్యాకథాన్ అనేది కేవలం పోటీ కాదు ఇది ఒక అభ్యాస వేదిక అని అన్నారు. ఛైర్మన్ డాక్టర్ ఎన్. సింధూర, డైరెక్టర్ షేక్ కరిమున్నీసా సారథ్యంలో నిరంతరం ఇలాంటి కార్యక్రమాలు కొనసాగిస్తామని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకూ ప్రాధాన్యం

వైఎస్సార్ సీపీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ

పట్నంబజారు: అనుబంధ విభాగాల కమిటీ ఏర్పాటులో కష్టపడి పనిచేసే ప్రతి ఒక్క కార్యకర్తకు ప్రాధాన్యత కల్పిస్తామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ చెప్పారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి షేక్ మస్తాన్‌వలి బుధవారం గుంటూరులోని ఆయన నివాసంలో అంబటిని కలిశారు. త్వరితగతిన అనుబంధ విభాగాల కమిటీలను ఏర్పాటు చేయాలని విన్నవించారు.ఈ సందర్భంగా అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ పార్టీ జెండాను భుజాన పెట్టుకుని పాటు పడిన ప్రతి ఒక్కరికీ ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ఏ రాజకీయ పార్టీకైనా అనుబంధ విభాగాలే పట్టుగొమ్మలని చెప్పారు. పొన్నూరు నియోజకవర్గంలో అనుబంధ విభాగాలన్నింటినీ త్వరితగతిన పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి షేక్ మస్తాన్‌వలి మాట్లాడుతూ అనుబంధ విభాగాల ఏర్పాటుపై కసరత్తు చేస్తున్నట్లు తెలిపారు. దానిలో భాగంగా నియోజకవర్గ సమన్వయకర్త, పార్టీ జిల్లా అధ్యక్షులు, నగర, పట్టణ అధ్యక్షులను కలిసి విన్నవిస్తున్నట్లు తెలిపారు.



అంబటి మురళీకృష్ణకు వినతిని అందిస్తున్న మస్తాన్‌వలి

ఎంబెడెడ్ సిస్టమ్స్‌తో పలు ఉపయోగాలు



సుభాష్‌ను సత్కరిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ జ్యోత్స్న కుమారి, అధ్యాపకులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఎంబెడెడ్ సిస్టమ్స్ నిత్య జీవితంలో అనేక విధాలుగా ఉపయోగపడతాయని అజిముత్ ఏఐ టెక్నాలజీస్ ప్రైవేటు లిమిటెడ్ ఉపాధ్యక్షుడు ఎస్. సుభాష్ పేర్కొన్నారు. సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో బుధవారం భౌతిక, ఎలక్ట్రానిక్స్ విభాగాలు సంయుక్తంగా ఎంబెడెడ్ సిస్టమ్స్ అనే అంశంపై సర్టిఫికెట్ కోర్సు ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సుభాష్ మాట్లాడుతూ నిత్యం ఉపయోగించే వివిధ పరికరాల్లో ఎంబెడెడ్ సిస్టమ్స్ అంతర్భాగమని తెలిపారు. సాంకేతిక అభివృద్ధి చెందుతున్న కొద్దీ వీటి ప్రాముఖ్యత మరింతగా పెరుగుతుందని పేర్కొన్నారు. మెడికల్ పరికరాల్లో ఎమ్మారై, ఈసీజీ యంత్రాలు ఎంబెడెడ్ సిస్టమ్స్‌ను కలిగి ఉంటాయని తెలిపారు. కళాశాల విద్య ఐటీ విభాగ ఓఎస్డీ ఏపీ కవిత మాట్లాడుతూ ఎంబెడెడ్ సిస్టమ్స్ ప్రాధాన్యత వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వీఆర్ జ్యోత్స్నకుమారి, కళాశాల విద్య అకడమిక్ గైడెన్స్ అధికారి సీహెచ్. తులసి, అజిముత్ ఏఐ టెక్నాలజీస్ సీఈవో బి. శ్రీదేవి, భౌతిక, ఎలక్ట్రానిక్స్ విభాగాధిపతి డి. విజయశ్రీ, అధ్యాపకులు ఏ. పద్మావతి, కె.విజయలక్ష్మి, జి. శిరీష, ఎండీ నయీం, నిఖిత పాల్గొన్నారు.

రామాయణం.. జీవన పారాయణం

నగరంపాలెం: స్థానిక ఏటీ అగ్రహారం శ్రీకంచి కామకోటి పీఠ శంకర గాయత్రీ దత్తసాయి సత్యదేవ మందిరం (గాయత్రి మాతా మందిరం)లో బుధవారం సంస్కృత సప్తాహం చేపట్టారు. దేవాలయ పాలక వర్గ సభ్యులు రాళ్లబండి వెంకట సత్య రామాంజనేయ శర్మ మాట్లాడుతూ సంస్కృతం జనభాష కావాలన్నారు. మానవుని మహనీయునిగా, మహాత్మునిగా మార్చే మహత్ గ్రంథం శ్రీమద్రామాయణమని పేర్కొన్నారు. అందరూ పఠించాలని ఆయన సూచించారు. డాక్టర్ కోగంటి వెంకటలక్ష్మీ నృసింహ అప్పలచార్యులు 'రామాయణం - ధర్మం ' అనే అంశంపై మాట్లాడారు. ధర్మాన్ని కాపాడితే అతి నిన్ను కాపాడుతుందని తెలిపారు. ధర్మాన్ని నాశనం చేస్తే అది ప్రాణులనన్నింటిని నాశనం చేస్తుందని పేర్కొన్నారు. రాముడు ధర్మస్వరూపుడని తెలిపారు. రాముడి గొప్పతనాన్ని మారీచుడు రావణాసురునికి తెలియజేశాడని చెప్పారు. రామాయణంలో మొట్టమొదట కనిపించేది ఆచార్య ధర్మం అని చెప్పారు. రామాయణం అలవాటైతే ధర్మాన్ని తప్పరని, సోదరులపై అభిమానం, తల్లిదండ్రులపై భక్తిశ్రద్ధలు, భార్యతో ప్రేమగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ అన్నదానం అంజనీకుమార్, డాక్టర్ జన్నాభట్ల ఉమా, డాక్టర్ అబ్బరాజు ఉదయకిరణ్, సంస్కృత భారతీ కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అప్పలాచార్యులు